సాక్షి నంద్యాల

శుక్రవారం । 30 । మే । 2025



బంగారు విభూతి రేఖల బహూకరణ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానానికి తిరుపతికి చెందిన కె.ఆర్.నారాయణమూర్తి 42 గ్రాములతో తయారు చేయించిన బంగారు విభూతి రేఖలను విరాళంగా సమర్పించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,592.47
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:13.082
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:12,333
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:188



మల్లన్నకు విశేషపూజలు

శ్రీశైలం టెంపుల్: ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని గురువారం స్వర్ణరథారూఢులైన శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషపూజలు చేపట్టారు. వర్షం కారణంగా స్వర్ణరథోత్సవం నిలుపుదల చేశారు.

న్యూస్‌రీల్

అధిక ఎరువుల వినియోగంతో అనర్థాలు

● జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



బుక్కాపురంలో రైతులకు సబ్సిడీపై జీలుగలను అందిస్తున్న జిల్లా కలెక్టర్

మహానంది: అధిక దిగుబడుల కోసం రైతులు మోతాదుకు మించి ఎరువులు వినియోగిస్తే అనేక అనర్థాలు ఉత్పన్నమవుతాయని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అన్నారు. గురువారం బుక్కాపురం గ్రామంలో నిర్వహించిన 'వికసిత కృషి సంకల్ప అభియాన్' కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రసాయనాలు, అధిక శాతం నీరు పంటలకు ఇవ్వడం ద్వారా భూసాంద్రత, కార్బన్ కంటెంట్, సూక్ష్మ పోషకాలు తగ్గే అవకాశం ఉందన్నారు. పొలాల్లో ప్రకృతి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని కలెక్టర్ రైతులకు వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు 40 రైతు గ్రూపులకు డ్రోన్లను అందించామని చెప్పారు. జిల్లాలో రైతు తలసరి ఆదాయాన్ని పెంచేలా వనరులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు కుంచపు లక్ష్మీ నరసమ్మ, గ్రామ సర్పంచ్ కందుల వరలక్ష్మమ్మ, జెడ్పీటీసీ మహేశ్వర రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి నాగరాజు, ఐసీఏఆర్ శాస్త్రవేత్త డాక్టర్ సూగన్న, కేవీకే శాస్త్రవేత్త రమణయ్య, ఆత్మ పీడీ రత్నకుమార్, ఏడీఏ రాజశేఖర్, ఏఓ నాగేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారా రోయింగ్ పోటీల్లో బంగారు పతకాలు



బంగారు పతకాలతో వెంకటనారాయణ

ప్యాపిలి: పట్టణానికి చెందిన కొంగనపల్లి వెంకటనారాయణ పారా రోయింగ్‌లో తన సత్తా చాటుతున్నారు. థాయ్‌లాండ్‌లో ఈ నెల 26 నుంచి ఏషియన్ ఇండో రోయింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో వెంకటనారాయణ పాల్గొన్నారు. ఏడు దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో వెంకటనారాయణ రెండు కిలోమీటర్ల దూరాన్ని 7.5 నిమిషాలు, 500 మీటర్ల దూరాన్ని 1.3 సెకండ్ల వ్యవధిలోనే చేరుకున్నారు. సింగిల్స్ విభాగంలో రెండు బంగారు పతకాలను సాధించినట్లు వెంకటనారాయణ తెలిపారు.

రూ.61 లక్షల ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

మహానంది: మహానందిలో గురువారం నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో భాగంగా 61 రోజులకు రూ. 62,17,845 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. అభిషేక మండపంలో శ్రీ కామేశ్వరి దేవి, శ్రీ మహానందీశ్వర స్వామి ఆలయాలతో పాటు శ్రీ కోదండ రామాలయం, వినాయక నంది, ఆంజనేయస్వామి ఆలయాల హుండీ కానుకలను లెక్కించారు. అందులో భాగంగా ఆయా హుండీల ద్వారా రూ. 61,59, 832, అన్నప్రసాదం విభాగం ద్వారా రూ. 26,683, గో సంరక్షణ ద్వారా రూ. 31,330 వచ్చింది అన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్లు అంబటి శశిధర్ రెడ్డి, ఎం. నీలకంఠ రాజు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

విండ్ పవర్ ఉత్పాదనకు భూముల పరిశీలన



భూములు పరిశీలిస్తున్న జేసీ విష్ణు చరణ్

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం, బేతంచెర్ల, గూటుపల్లె, ఎం. పెండేకల్లు, ముద్దవరం, కొలుములపల్లె గ్రామాల్లో విండ్ పవర ఉత్పాదనకు ప్రభుత్వ భూములను జేసీ విష్ణు చరణ్ గురువారం పరిశీలించారు. ఏకో రన్ సంస్థ ఆధ్వర్యంలో విండ్ పవర్ ఉత్పాదనకు అవసరమైన భూములు కేటాయించేందుకు ఆర్డీఓ నరసింహులు, తహసీల్దార్ ప్రకాశ్ బాబు, సర్వే బృందంతో కలిసి జేసీ ఆయా గ్రామాల్లో భూములను పరిశీలించారు. 27.80 ఎకరాల్లో 44 గాలి మరలు ఏర్పాటు చేసేందుకు సంస్థ చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం కనుమ కింది కొట్టాల గ్రామంలోని బిల్ల స్వర్గం గుహలను సందర్శించారు.

ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే



ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అవసరమై సచివాలయానికి వచ్చాను. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎలాంటి సర్టిఫికెట్లు కావాలన్నా వలంటీర్లకు చెబితే ఇంటి వద్దకే తెచ్చిచ్చే వాళ్లు. ఇప్పుడు ఈ ప్రభుత్వంలో మళ్లీ మేము కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

– సుబ్బయ్య ఆచారి, బస్తిపాడు

అన్నదాత సుఖీభవ ఎగ్గొట్టారు



నాకు 4 ఎకరాల భూమి ఉంది. 2 ఎకరాల్లో పత్తి నాటాం. మరో రెండు ఎకరాల్లో పొగాకు వేయాలనుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20వేలు ఇస్తామని చెప్పి మొదటి ఏడాది ఎగ్గొట్టింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమం కంటే ఎక్కువ ఇస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ నేతలు చెబితే నమ్మి ఓట్లేశాం. గత ఏడాది కందులను కేవలం రూ.6,800 ధరతో అమ్ముకున్నాం. 2022లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.11వేల ధర లభించింది. – సుధాకర్, బొల్లవరం

వ్యాపారాలు పడిపోయాయి



సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో ప్రజల దగ్గర డబ్బులు ఆడటం లేదు. మాలాంటి చిన్న వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. వ్యాపారం పూర్తిగా పడిపోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతినెలా ఏదో ఒక పథకం కింద నగదు ప్రజల ఖాతాల్లో జమ అయ్యేది. వాళ్లు కూడా ఏదో ఒక వస్తువు కొనుక్కునే వాళ్లు. ఇప్పుడు ఆ పరిస్థితి కరువైంది.

– లాల్‌బాషా, గార్మెంట్ షాపు యజమాని, ఉలిందకొండ

ఫొటోలు: వి. శ్రీనివాసులు సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



పాలన పచ్చపాతం.. సంక్షేమం పచ్చి అబద్ధం!

ఇది గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లక్ష్మీపురం గ్రామంలో నిర్మించిన సచివాలయం. నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రారంభానికి నోచుకోలేదు. తాగుబోతులకు నిలయంగా మారుతోంది. ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని ఎన్నికల ముందు ఒంటికాలిపై లేచిన టీడీపీ నేతలు, ఇప్పుడు లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన ఇలాంటి భవనాలను ప్రజా సేవకు వినియోగించకపోవడం విమర్శలకు తావిస్తోంది.



కార్యాలయంలో మద్యం సీసాలు



తాండవిస్తున్న అపరిశుభ్రత


అరచేతిలో వైకుంఠం 'సూపర్-6'

- మోసపోయామంటున్న ప్రజలు
- సంక్షేమాన్ని కోల్పోయామని ఆవేదన
- గత ప్రభుత్వ సేవలను ఇప్పటికీ మరవని జనం
- ఇప్పుడు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి
- కన్నీరు పెట్టుకుంటున్న రైతాంగం
- చేతిలో చిల్లిగవ్వ లేదంటున్న మహిళలు
- కొనుగోళ్లు లేవని వ్యాపారుల గగ్గోలు
- కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల పెదవివిరుపు

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం ఏడాది పాలన నేపథ్యంలో 'సాక్షి' పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలంలోని ఉల్లిందకొండ, చిన్నటేకూరు, బస్తిపాడు, బొల్లవరం, లక్ష్మీపురం గ్రామాలకు వెళ్లింది. రైతులు, కార్మికులు, మహిళలు, వ్యాపారులు.. ఇలా అన్ని వర్గాల ప్రజలను కలిసింది. దాదాపు 100 మందితో మాట్లాడితే 90 మంది ప్రధానంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఎన్నో హామీలను గుప్పించారని, సంక్షేమం అంటే ఏమిటో చూపిస్తామని చెప్పి నమ్మించారని.. తీరా ఇప్పుడు చూస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వలేకపోయారని వాపోయారు. రంగులు మార్చడం, ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని తెలుసని, అయితే ఈసారి ఏదో చేస్తారని అనుకుని మోసపోయామని

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతోంది. ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సూపర్–6 హామీలతో అరచేతిలో స్వర్గం చూపించారు. ఒకటి కాదు.. రెండు కాదు.. వందల సంఖ్యలో హామీలను ప్రజల ముందుంచి ఎన్నికల్లో లబ్ధి పొందారు. అయితే ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నాయే కానీ, ఒక్క హామీ కూడా పట్టాలెక్కని పరిస్థితి. ముఖ్యంగా రైతులు నిలువునా మోసపోగా.. అన్ని వర్గాల ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని గెలిపించి తాము చేసిన పొరపాటును ఇప్పుడిప్పుడే గ్రహిస్తున్నారు. సంక్షేమ పథకాల అమలు అటకెక్కడంతో ప్రజల్లో కొనుగోలు సామర్థ్యం తగ్గిపోయింది. ఫలితంగా ప్రతి ఒక్క రంగంపైనా ఆ ప్రభావం ప్రత్యక్షంగా, పరోక్షంగా చూపుతోంది. ఈ నేపథ్యంలో 'సాక్షి' ప్రభుత్వ పాలనపై ప్రజలను కలువగా.. తమ కన్నీటి ఘోషను కథలు కథలుగా ఏకరువుపెట్టారు.

చెప్పడం గమనార్హం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకొని తాము ఏమి కోల్పోయామో వివరించారు. వీరి మనోభావాలను పరిశీలిస్తే పల్లె కన్నీటి గాథలు వర్ణనాతీతం.





ఇది బొల్లవరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులకు వెన్నుదన్నుగా నిలిచింది. అన్ని రకాల సేవలను స్థానికంగానే అందించి రైతులకు వ్యయప్రయాసలు లేకుండా చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఈ కేంద్రం పరిస్థితి అధ్వానంగా మారింది. తాగిపడేసిన మద్యం బాటిళ్లు ఈ ప్రాంతంలో ఎక్కడపడితే అక్కడ కనిపిస్తున్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇక్కడ ఎలాంటి సేవలు అందకపోవడం వల్ల శిథిలావస్థకు చేరుకుంటోంది.

➤ గ్రామ, వార్డు సచివాలయాలు 516 ఉండగా.. 4,297 పోస్టులు మంజూరయ్యాయి. ప్రస్తుతం 3,810 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. సచివాలయాలలో 36 రకాల సేవలు అందుతున్నాయి. రోజుకు ఒక్కో సచివాలయంలో సగటున 165 మంది సేవలు పొందడం జరిగేది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రోజుకు 20 మంది కూడా సేవలు పొందని పరిస్థితి.

➤ జిల్లాలోని మొత్తం రైతుభరోసా కేంద్రాలు 411 ఉండగా... వీఏఏలు 210 మంది, వీహెచ్‌ఏలు 101 ఉన్నారు. ఆర్‌బీకేల ద్వారా వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి 32 రకాల సేవలు అందుతున్నాయి. రోజు సగటున ఒక్కో ఆర్‌బీకేలో కనీసం 75 మంది సేవలు పొందడం జరిగేది. ప్రస్తుతం ఐదారు మందికి కూడ సేవలు అందడం లేదు.

మాటలైతే చెప్పారు కానీ..



నేను చిన్నపాటి వ్యాపారం చేసుకుంటున్నా. పొదుపు సంఘంలో ఉన్నా. ఎన్నికలకు ముందు టీడీపీ నాయకులు ఎన్నో మాటు చెప్పినారు కానీ, ఒక్కటీ అమలు చేయలేకపోయారు. ఒక్కరి దగ్గర కూడా చేతిలో డబ్బులు ఆడటం లేదు. సంవత్సరం అయిపోయినా, ఇంకెప్పుడు పథకాలు ఇస్తారో తెలుస్తలేదు.

– నిర్మలమ్మ, బొల్లవరం గ్రామం

బియ్యం తప్ప ఏమిస్తున్నారు



జగన్ ప్రభుత్వంలో ఇంటి వద్దకే సరుకులు ఇస్తుండ్రి. ఇప్పుడు ఆ బండ్లను కూడా తీసేసినారంట. ఈ ప్రభుత్వం వచ్చినాక ఒక్క బియ్యం తప్ప ఏమీ ఇస్తలేరు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చక్కెర, కందిపప్పు, జొన్న, రాగులు పంపిణీ చేస్తుండ్రి. ఇప్పుడు తలుచుకుంటే బాధయితాంది.

– మహబూబ్ బీ, వృద్ధురాలు, బస్తిపాడు

పెట్టుబడులకు ఎవరిని అడుక్కోవాల



గత సంవత్సరం పండించిన పొగాకు ఇప్పటికీ ఇంట్లోనే ఉండిపోయింది. ధర చూస్తే ఏడుపొస్తుంది. ఎనిమిది ఎకరాల భూమి ఉంది. ఇప్పుడు వానలు పడుతున్నాయి. సాగుకు లక్ష రూపాయల వరకు అవసరం. చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ కింద డబ్బులు ఇస్తాడనుకున్నాం. ప్రభుత్వం వచ్చి సంవత్సరం అయితున్నా ఒక్కరూపాయి ఇచ్చింది లేదు. పెట్టుబడులకు ఎవరిని అడుక్కోవాల. మా బతుకు నాశనమైనాయి.

– మినల్లా హుసేన్, బస్తిపాడు

అడుగడుగునా కన్నీళ్లే!

చిన్నటేకూరు సమీపంలోని బస్తిపాడు రోడ్డు పక్కనే మల్లె తోటలో పూలు తెంపుతున్న మహిళలను పలుకరించగా ఎక్కువ మంది తమ అభిప్రాయాలను కుండబద్దలు కొటినట్లు చెప్పారు. కురువ శంకరమ్మ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఆడబిడ్డ నిధి కింద ఇంటిలో 18 నుంచి 59 ఏళ్ల మహిళలు ఎంతమంది ఉంటే అందరికీ నెలకు రూ.1500 ప్రకారం ఏడాదికి రూ.18వేలు ఇస్తామన్నారు.. ఇప్పుడు ఏడాది అవుతున్నా ఒక్క రూపాయి కూడా ఇయ్యలేదన్నారు. అక్కడే ఉన్న హేమలత, ఖైరున్‌బి, లక్ష్మీదేవీ మాట్లాడుతూ... వైఎస్ జగన్ చెప్పింది చెప్పినట్లు అన్నీ చేశారని, అమ్మఒడి, వైఎస్‌ఆర్ చేయూత, ఆసరా, వైఎస్‌ఆర్ రైతుభరోసా.. ఇలా ఎన్నో పథకాలతో ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేసుకున్నారు.



నంద్యాల జిల్లాలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు పొందిన లబ్ధి వివరాలు..

పథకం	లబ్ధిపొందిన వారు	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్‌ఆర్ రైతుభరోసా	2,11,786	1475.83
వైఎస్‌ఆర్ నేతన్న నేస్తం	2,800	67.20
విద్యా దీవెన	1,16,089	286.27
వసతి దీవెన	1,14,671	129.88
వైఎస్‌ఆర్ ఆసరా	2,49,371	468.28
వైఎస్‌ఆర్ చేయూత	97,254	698.92
సున్నా వడ్డీ రుణాలు	19,323(గ్రూపులు)	87.09
వైఎస్‌ఆర్ బీమా	4578	45.49
జగనన్న తోడు	52282	52.28
కళ్యాణమస్తు, షాదీతోఫా	2952	23.71
చేదోడు	92,452	94.45
కాపు నేస్తం	20,812	31.20
ఈబీసీ నేస్తం	44,494	76.59
అమ్మఒడి	4,87,707	634.01



బస్తిపాడు సమీపంలో పత్తి పంటలో కుటుంబసభ్యులతో కలసి కలుపు తీస్తున్న గొల్ల శివన్న, శేషన్నలను కలువగా సూపర్–6 హామీల పేరుతో ఓట్లు దండుకొని మోసగించారని వాపోయారు. సంవత్సరం అయినా ఎవ్వరికీ ఏమీ చేయలేదన్నారు. మరో చేనులో కలుపు తీస్తున్న శివమ్మ, సుంకులమ్మలతో మాట్లాడితే.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ 50 ఏళ్లకే పింఛను ఇస్తామని చెప్పినా అతీగతీ లేదన్నారు. ఉచిత బస్సు మాటే ఎత్తడం లేదని, అన్నీ ఉత్తుత్తి హామీలేనని నవ్వుకున్నారు.



ఉలిందకొండలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో కాలువల్లో పేరుకుపోయిన పూడిక

బస్తిపాడు గ్రామంలో సచివాలయానికి వెళ్లాం. అక్కడ గంగన్న అనే రైతుతో ముఖాముఖి మాట్లాడగా కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై పెదవి విరిచారు. రైతులు, మహిళలతో పాటు ఏ ఒక్కరికీ మేలు జరగలేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కూడా దక్కడం లేదన్నారు. సచివాలయాలు, ఆర్‌బీకేలు నిస్తేజంగా మారిపోయాయన్నారు. సచివాలయం ఖాళీగా ఉంది.. మీరే లోనికి పోయి చూడండి అని అక్కడి నుంచి వెళ్లిపోయారు. తేజ, చిన్నారి అనే వారు రేషన్ కార్డు కోసం సచివాలయంలో వేలిముద్ర వేసేందుకు వచ్చారు. వలంటీర్లు ఉంటే మాకు సచివాలయానికి వచ్చే పరిస్థితి ఉండేది కాదని.. అన్ని సేవలు ఇంటి వద్దే అందేవని చెప్పడం విశేషం.





లక్ష్మీపురంలోని సచివాలయం దగ్గర చిన్నపాటి హోటల్ బయట కూర్చున్న పరమేష్, సుంకన్న, మునిస్వామి, ఉసేన్‌బాషాలతో మాట్లాడగా.. చంద్రబాబునాయుడు మాట్లాడితే రాజధాని అమరావతి అంటాడే కానీ, రాయలసీమ గురించి పట్టించుకోవడం లేదన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వ్యవసాయం చేయాలంటేనే భయపడే పరిస్థితి వచ్చిందన్నారు.

ఉల్లిందకొండ గ్రామానికి వెళ్లగా అక్కడ కట్టపై స్థానికులు కనిపించారు. వాళ్లతో మాట కలుపగా సూపర్–6 హామీలని నమ్మించి గుండు కొట్టించారన్నారు. రైతులు వెంకటేశ్వర్లు, ఎల్లప్ప, కార్మిక సంఘాల నేతలు కృష్ణ, మధు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలన తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అరచేతిలో స్వర్గం చూపించి ఇప్పుడు ప్రజల ఆశలను వమ్ము చేశారన్నారు.



క్లుప్తంగా

ఎక్సైజ్ అధికారుల దాడులు



నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 'పల్లెల్లో నాటు సారాక్షసి' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు ఆధ్వర్యంలో పోలీసులు గురువారం అవుకు మండలం కొండమనాయునిపల్లె, పిక్కిళ్లపల్లి తండాలో దాడులు చేశారు. పిక్కిళ్లిపల్లి తండాలో 800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. కొండమనాయునిపల్లెలో జగ్గారెడ్డిస్వామి వద్ద సారా స్థావరాన్ని గుర్తించి 10 లీటర్లసారాను స్వాధీనం చేసుకున్నారు. చెన్నారెడ్డి చెరువు వద్ద 13,00 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. మన్నేనాయక్ తండాలో 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు కృష్ణ, సీఐ వర్ధనాదేవి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

జూలై 2 నుంచి విజయవాడకు విమానం

- వారంలో మూడు రోజుల సర్వీసు

కర్నూలు(సెంట్రల్): ప్రస్తుతం కర్నూలు నుంచి విజయవాడకు వెళ్లాలంటే దాదాపు ఎనిమిదిన్నర గంటల సమయం పడుతోంది. రోడ్లు బాగోలేక పోవడంతో కొన్ని సమయాల్లో అంతకంటే ఎక్కువ సమయమే అవుతుంది. ఈ నేపథ్యంలో కర్నూలు నుంచి విజయవాడకు విమాన సర్వీసును నడిపేందుకు రంగం సిద్ధమైంది. జులై 2 నుంచి వారంలో మూడు రోజుల పాటు విమానాలను తిప్పనున్నట్లు ఇండిగో సంస్థ అధికారంగా ప్రకటించింది. దీంతో కర్నూలు నుంచి విజయవాడకు ఒక గంట ఐదు నిమిషాల్లో చేరుకునే వీలు కలుగనుంది.

- సోమవారం, బుధవారం, శుక్రవారాల్లో విమాన సర్వీసు ప్రజలకు అందుబాటులో ఉంటుంది.
- విజయవాడ నుంచి మధ్యాహ్నం 3:45 గంటలకు విమానం బయలుదేరి సాయంత్రం 4:50 నిమిషాలకు కర్నూలు చేరుకుంటుంది.
- తిరిగి అదే విమానం సాయంత్రం 5:10 గంటలకు విజయవాడకు బయలుదేరి 6:15 గంటలకు చేరుకుంటుంది.
- ప్రయాణ చార్జీ ఒక్కసారికి దాదాపు రూ.2,600 ఉంటుందని ఓర్వకల్లు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

డోన్ రూరల్: పట్టణంలోని స్థానిక రైల్వే స్టేషన్‌లో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్‌ఐ బిందుమాధవి తెలిపారు. గుంతకల్లు వైపు వెళ్లె 4వ ప్లాట్ ఫాం పుట్ ఓవర్ బ్రిడ్జిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని డిప్యూటీ స్టేషన్ మేనేజర్ దేవేంద్ర సమాచారం ఇవ్వడంతో వెళ్లి పరిశీలించామన్నారు. మృతి చెందిన వ్యక్తి వద్ద ఎటువంటి ఆచూకీ ఆధారాలు లభించలేదన్నారు. మృతునికి సుమారు 45 ఏళ్ల వయస్సు ఉంటుందన్నారు. బ్లూకలర్ షర్ట్, నలుపు రంగు ఫ్యాంట్, ఎత్తు 5 అడుగులు ఉంటారన్నారు. మృత దేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిసిన వారు డోన్ రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

4న వెన్నుపోటు దినం

- జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, నిరసనలు, వినతిపత్రాలు అందజేత
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకుపోదాం
- వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గంగుల ప్రభాకర్ రెడ్డి, పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేతలు

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి జూన్ నెల 4వ తేదీకి ఏడాది అవుతుందని, అదే రోజు వెన్నుపోటు దినం పేరుతో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆ పార్టీ కర్నూలు పార్లమెంట్ పరిశీలకులు గంగుల ప్రభాకర్ రెడ్డి పిలుపు నిచ్చారు. నియోజక వర్గ కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేయాలన్నారు. కర్నూలులోని ఎస్వీ కాంప్లెక్స్‌లో గురువారం సాయంత్రం జిల్లా స్థాయి పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే బూసినేని విరూపాక్షి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పార్టీ ఇన్‌చార్జ్‌లు హాజరయ్యారు.

- గంగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. తల్లికి వందనం పథకం ఏమైందని ప్రశ్నించారు. బాబు వస్తే జాబు గ్యారెంటీ అని ఎన్నికల సమయంలో ఊదరగొట్టి అధికారంలోకి వచ్చాక ఏడాది పాలనలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారన్నారు. 'అన్నదాత సుఖీభవ పేరుతో రూ. 20 వేలు ఇస్తామని మోసం చేయలేదా' అని ప్రశ్నించారు.
- కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ఏడాది పాలనలో టీడీపీ అధినేత చంద్రబాబు అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ఇంటింటికీ సంక్షేమంతో పాటు ఇంట్లో ఎంత మంది ఉంటే అంత మందికి పథకాలు ఇస్తామని ప్రజలను మోసం చేశారన్నారు. చేతకాని పాలన చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోతే చొక్కా పట్టుకోవాలని ఎన్నికల సమయంలో నారా లోకేష్ అన్నారని, ప్రజలకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.
- ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై సమరశంఖం పూరించే సమయం ఆసన్నమైందన్నారు. హామీలు అమలు చేయకుండా ఇంకెన్నాళ్లు ప్రజలను మోసం చేస్తారని ప్రశ్నించారు. మోసం చేసి గద్దెనెక్కిన అధికార పార్టీ నేతలను వదిలి పెట్టే ప్రసక్తి లేదన్నారు.
- ఆలూరు ఎమ్మెల్యే బూసినేని విరూపాక్షి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందిందన్నారు. ప్రజకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు.
- ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడు.. ప్రభుత్వం ఏడాది అవుతున్నా.. హామీలు ఏ ఒక్కటి అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు.
- సమావేశంలో కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య, పార్టీ సమన్వయకర్తలు, ఇన్‌చార్జ్‌లు బుట్టా రేణుక (ఎమ్మిగనూరు), ఆదిమూలపు సతీష్ (కోడుమూరు), కుడా మాజీ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ఏడేళ్ల బాలికపై అత్యాచారం

కౌతాళం: కౌతాళం పోలీస్‌స్టేషన్ పరిధిలోని వల్లూరు గ్రామంలో ఏడేళ్ల బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. గురువారం మధ్యాహ్నం చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి హెడ్‌కానిస్టేబుల్ సోమల నాయక్ తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన ఏడేళ్ల బాలిక స్థానిక ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి చదువుతోంది. ఇదే గ్రామానికి చెందిన రంగస్వామి(20) పాపకు మాయమాటలు చెప్పి చాక్లెట్లు, బిస్కెట్లు కొనిస్తానని.. కర్జికాయలు ఇస్తానని చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఇంట్లోకి తీసుకెళ్లి తలుపులు వేసుకుంటుండగా పాప అక్క(పదేళ్లు) గమనించింది. అయితే ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో ఇంటికి వెళ్లి విషయాన్ని తల్లికి చెప్పింది. వెంటనే ఆమె అక్కడకు వెళ్లగా గమనించిన యువకుడు పరారయ్యాడు. తల్లి ఫిర్యాదు మేరకు బాధిత చిన్నారిని వైద్య పరీక్షల నిమిత్తం ఆదోని ఆసుపత్రికి తరలించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. నిందితుడి కోసం పోలీసులు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

డీసీసీబీ చైర్మన్‌గా ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్‌గా కర్నూలు మండలం ఎదురూరు గ్రామానికి చెందిన డి.విష్ణువర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఎక్స్ అఫీషియో, స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ గురువారం జీవో ఆర్‌టీ నంబరు 350 జారీ చేశారు. ఏడుగురితో నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ ఏర్పాటు కావాల్సి ఉంది. ప్రస్తుతానికి చైర్మన్ ఒక్కరినే నియమిస్తూ జీవో జారీ అయ్యింది. డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలో సభ్యులు(డైరెక్టర్లు)గా నియమితులయ్యేందుకు ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజక వర్గాల నుంచి పోటీ తీవ్రస్థాయిలో ఉంది. జీవోలో డైరెక్టర్ల పేర్లు లేకపోవడంతో ఆశావహుల్లో అసంతృప్తి నెలకొంది.

మహానాడు అంతా డ్రామా

- ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి



మెదేహాల్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

హాలహర్వి: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా సీఎం చంద్రబాబునాయు కడపలో మహానాడు డ్రామా సభ నిర్వహిస్తున్నారని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి విమర్శించారు. మెదేహాల్ గ్రామంలో గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. గ్రామంలో కార్యకర్తలతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి కార్యకర్తలు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. మే నెలలో కొత్త పింఛన్లు అని చెప్పిన ప్రభుత్వం ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. నిట్రవట్టి గ్రామంలోని బీసీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేవని ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామారెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, మండల కార్యదర్శులు గోపాలకృష్ణ, బాపురం శివరాజ్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షులు గంగాధర, సీనియర్ నాయకులు సురేంద్రనాథ్‌పటేల్, లింగప్ప, నాగరాజు, నల్లన్న, బాణాల బసవరాజు, నారాయణ, పరశురాం, గాదిలింగప్ప, రామయ్య పాల్గొన్నారు.

ఐదేళ్ల అభివృద్ధి టీడీపీ నేతలకు కనిపించదు



ప్రభుత్వ ఐటీఐ కలశాల భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

- చెత్త రాజకీయాలు ఇంకెన్నాళ్లు చేస్తారు
- చేతనైతే హామీలు అమలు చేయండి
- మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి

బేతంచెర్ల: డోన్ నియోజకవర్గంలో గత వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన ఐదేళ్ల అభివృద్ధిని టీడీపీ నేతలు కళ్లుండి చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారని మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. గురువారం గోరుమానుకొండ గ్రామ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, ఎంఎస్‌ఎంఈ భవనాలను నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ. కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనాలను టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా వినియోగంలోకి తీసుకు రాలేకపోవడం దారుణం అన్నారు. గ్రామీణ, పట్టణ విద్యార్థులకు విద్యతో పాటు సాంకేతిక రంగాల్లో రాణించాలని ముందు చూపుతో ఐటీఐ, ఎంఎస్‌ఎంఈ, బీసీ బాలుర రెసిడెన్షియల్ స్కూలు మంజూరు చేయించి పఫ్‌షీట్లతో నిర్మాణాలు చేపడితే వాటిపై కూడా టీడీపీ నాయకులు విమర్శలు చేయడం అవివేకమన్నారు. రేకులకు, పఫ్ షీట్లకు తేడా తెలియని స్థితిలో వారున్నారన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం చెత్త రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. చేతనైతే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు పూర్తిగా అమలు చేసి మాట్లాడాలన్నారు. అనంతరం బీసీ బాలుర రెసిడెన్షియల్ స్కూల్ భవనాన్ని పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు ఉన్నారు, సౌకర్యాలు ఏవిధంగా ఉన్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. త్రీఫేజ్ విద్యుత్ సరఫరా లేకపోవడంతో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విన్నవించారు. సంపద సృష్టించే సీఎం, బీసీల కోసం పుట్టిన పార్టీ అని చెప్పుకుంటున్న టీడీపీ నేతలు బీసీ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థులకు టేబుళ్లు, విద్యుత్ సౌకర్యం ఎందుకు కల్పించలేకపోతున్నారని ప్రశ్నించారు . ఇప్పటికైనా టీడీపీ నాయకులకు చిత్త శుద్ధి ఉంటే ఈ భవనాల్లో సౌకర్యాలు మెరుగు పరిచి వినియోగంలోకి తేవాలన్నారు. బుగ్గన వెంట ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, రాష్ట్ర మాజీ ఉర్దూ అకాడమీ, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరక్టర్లు ముర్తుజావలి, ఖాజా హుసేన్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రుడు, నాయకులు తిరుమలేశ్వర్‌రెడ్డి, గూని నాగరాజు, తిమ్మయ్య, ఎద్దులన్న,భాస్కర్ పాల్గొన్నారు.

సెమిస్టర్ పరీక్షల్లో 17 మంది డిబార్

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో గురువారం 17 మంది విద్యార్థులు చూచిరాతకు పాల్పడగా గుర్తించి డిబార్ చేశారు. రెండో సెమిస్టర్ పరీక్షలకు 9,579 మందికి 8,514 మంది హాజరు కాగా 1,065 మంది గైర్హాజరయ్యారని వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలకు 97 మందికి 78 మంది విద్యార్థులు హాజరు కాగా 19 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు.

ఆడపిల్లల సంఖ్య తగ్గకుండా చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో ఆడపిల్లల సంఖ్య తగ్గకుండా అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆన్‌లైన్‌లో స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తులను కమిటీ ఆమోదం కోసం ప్రవేశపెట్టారు. వీటిని జిల్లా స్థాయి అడ్వయిజరి కమిటీ సభ్యులు పరిశీలించి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ కమిటీ ఆమోదం కోసం పంపించారు. పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నాగప్రసాద్‌బాబు, జీజీహెచ్ పీడియాట్రిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ విజయానందబాబు, రేడియాలజీ హెచ్‌వోడీ డాక్టర్ రాధారాణి, గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ శ్రీలక్ష్మి, సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖాదర్‌బాషా, డెమో శ్రీనివాసులు శెట్టి, ఎన్‌జీవో ప్రతినిధులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇన్‌ఫర్మేషన్ ఇంజినీర్ దివాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ సీఈఓగా రామాంజనేయులు బాధ్యతలు స్వీకరణ

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారిగా పి.రామాంజనేయులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన డీసీసీబీలో జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో దాదాపు 8 సంవత్సరాల పాటు సీఈఓగానూ సేవలందించారు. 18 నెలల క్రితం సీఈఓ పోస్టు నుంచి వైదొలిగారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. కొద్ది రోజుల పాటు డీసీసీబీలో మరో జనరల్ మేనేజర్ శివలీల సీఈఓగా ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత డీసీసీబీలో స్పెషల్ ఆఫీసర్‌గా పని చేస్తున్న ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్ సీఈఓగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన తిరిగి ఆప్కాబ్‌కు వెళ్లడంతో ఆ స్థానంలో జనరల్ మేనేజర్‌గా ఉన్న రామాంజనేయులును సీఈఓగా నియమిస్తూ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి, జేసీ నవ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన బాధ్యతలు చేపట్టారు.

ఆర్అండ్‌బీలో బదిలీలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి

కర్నూలు(అర్బన్): రోడ్లు, భవనాల శాఖలో ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాలతో పాటు అనంతపురం నేషనల్ హైవేస్ ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ గురువారం స్థానిక ఆర్అండ్‌బీ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ కర్నూలు, నంద్యాల ఎస్ఈలు మహేశ్వరరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, అనంతపురం నేషనల్ హైవేస్ ఎస్ఈ హరిప్రసాద్, కర్నూలు ఈఈ సురేష్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్నూలు ఎస్ఈ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ నాన్ టెక్నికల్ ఉద్యోగులు (సూపరింటెండెంట్స్, సీనియర్ అసిస్టెంట్లు, టెక్నికల్ ఆఫీసర్స్, జూనియర్ టెక్నికల్ ఆఫీసర్లు తదితరులు) మొత్తం 239 మందికి గాను ఒకే ప్రాంతంలో ఐదేళ్లకు పైగా విధులు నిర్వహిస్తున్న వారు 69 మంది ఉన్నారన్నారు. అలాగే ఐదు సంవత్సరాల లోపు ఉన్న వారు 47 మంది రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్స్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. మొత్తం 116 మందికి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఎస్ఈ తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బదిలీలను పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. ఇంజినీర్లకు సంబంధించిన బదిలీలు ఈఎన్‌సీ స్థాయిలో జరుగుతాయన్నారు.


జనం లేక వెలవెల



బస్సుల వద్ద కనిపించని ప్రజలు

కడపలో జరుగుతున్న మహానాడు బహిరంగ సభకు కర్నూలు నియోజకవర్గం నుంచి ప్రజలను తరలించేందుకు బస్సులు ఏర్పాటు చేశారు. కర్నూలు ఎస్టీబీసీ కాలేజీ గ్రౌండ్ సమీపంలో వీటిని నిలిపారు. అయితే జనం లేకుండానే కొన్ని బస్సులు వెళ్లాయి. కొన్ని బస్సుల్లో కేవలం 15 మంది వెళ్లారు. మొత్తం ఆర్టీసీ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు 20కి పైగానే మహానాడుకు వెళ్లాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

ఒక్కరూ ఎక్కలేదు!



మధ్యాహ్నం వరకు మున్సిపల్ కార్యాలయం ముందు ఖాళీగా ఉన్న ఆర్టీసీ బస్సు

ఆళ్లగడ్డ: ఇక్కడ రోడ్డుపై నిలుచున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికుల కోసం ఆపింది కాదు. మహానాడుకు టీడీపీ కార్యకర్తలను తరలించేందుకు గురువారం ఆళ్లగడ్డ మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా ఓ బస్సును నిలిపారు. మెప్మా ఆధ్వర్యంలో పొదుపు సంఘాల సభ్యులను ఎక్కించాలని మున్సిపల్ కమిషనర్ సిబ్బందిపై ఒత్తిడి చేసినప్పటికీ ఒక్కరూ రాలేదు. దీంతో చేసేది లేక మధ్యాహ్నం వరకు బస్సును అక్కడే ఉంచుకున్న డ్రైవర్ ఎవరూ పట్టించుకోక పోవడంతో తిరిగి డిపోకు వెళ్లిపోయాడు. పదుల సంఖ్యలో ఆర్టీసీ, ప్రైవేటు స్కూల్ బస్సులు ఎవరూ ఎక్కకపోవడంతో తిరిగి వెళ్లిపోయాయి. పెద్దఎత్తున ప్రజలను తరలించాలని పార్టీ పెద్దలు చెప్పినా గ్రామాల్లో టీడీపీ నాయకులు అంటిముట్టనట్లుగా వ్యవహరించారు. 'ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఒక్క పథకం కూడా ప్రజలకు అందజేయలేదు.. ఏమని సమావేశానికి పిలవాలి' అని వారి ముఖం మీదనే చెప్పినట్లు తెలుస్తోంది. అనేక గ్రామాలకు బస్సులు పంపించినప్పటికీ ప్రజలు ఎక్కలేదు. కొన్ని చోట్ల ఐదారుగురితోనే బస్సులు మహానాడుకు బయలుదేరాయి.

కృష్ణా నదికి వరదనీరు

కర్నూలు (సిటీ): కృష్ణా నదికి వరద నీటి ప్రవాహం మొదలైంది. తెలంగాణలోని జూరాల ప్రాజెక్టుకు ప్రస్తుతం 40 వేల క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం ఉంది. ముందస్తుగా ఆ ప్రాజెక్టు గేట్లు పైకెత్తి 82 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా ఆ నీరు శ్రీశైలం వైపు పరుగులు తీస్తోంది. ఈ ప్రాజెక్టుకు శుక్రవారం ఉదయానికి లక్ష క్యూసెక్కుల వరదనీరు వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగా జూరాల గేట్లు ఎత్తివేశారు. తుంగభద్ర నదికి వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం మెలిగనూరు దగ్గర తుంగభద్ర నదిలో 17 వేల క్యూసెక్కుల వరదనీటి ప్రవాహం ఉన్నట్లు ఇంజినీర్లు తెలిపారు. సుంకేసుల బ్యారేజీకి ప్రస్తుతం 4,538 క్యూసెక్కుల వరద నీటి ప్రవాహం ఉండగా ఓ గేటు ద్వారా 4,379 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రైతు ప్రాణం తీసిన రోటవేటర్

కోసిగి: పొలం చదును చేస్తున్న రోటవేటర్ మదిరి అంజినయ్య (40) అనే రైతు ప్రాణం తీసింది. ఈ దుర్ఘటన గురువారం కొల్మాన్‌పేట గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పెద్ద ఈరన్న ట్రాక్టర్‌తో పొలాన్ని చదువును చేస్తున్నాడు. బంధువు కావడంతో మదిరి అంజినయ్య ట్రాక్టర్ వెనుక ఉన్న రోటవేటర్‌పై నిలబడి ఉన్నాడు. ప్రమాదవశాత్తు కాలు జారి రోటవేటర్‌లో ఇరుక్కుని కింద భాగం పడి పోయాడు. కాలు భాగం పూర్తిగా నుజ్జు నుజ్జు అయి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన పొలంలోని బంధువులు కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. అక్కడ వైద్యులు పరీక్షించేలోగా మృతి చెందాడు. మృతినికి భార్య నరసమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు పదోన్నతుల 'పరీక్ష'

- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపాధ్యాయుల ఓపికను పరీక్షించిన అధికారులు
- ఉపాధ్యాయుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళనకు దిగిన టీచర్లు
- ఎట్టకేలకు దిగివచ్చి మాన్యువల్‌గా కౌన్సెలింగ్
- ఉమ్మడి జిల్లాలో 161 మందికి హెచ్‌ఎంలుగా పదోన్నతులు



పదోన్నతుల కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు, సంఘాల నాయకులు



పదోన్నతుల కోసం చీకట్లో ఎదురుచూస్తున్న ఉపాధ్యాయులు

కర్నూలు (సిటీ): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతుల ప్రక్రియ పరీక్షగా మారింది. విద్యాశాఖ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ టీచర్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా, సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పనిచేస్తున్న వారికి స్కూల్ అసిస్టెంట్ టీచర్లుగాను, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలుగాను పదోన్నతులు కల్పించేందుకు ఇటీవలే ఉత్తర్వులు ఇచ్చారు. అయితే గతంలో ఎప్పుడూ లేని విధంగా పదోన్నతులు రాష్ట్రస్థాయిలోనే విద్యాశాఖ డైరెక్టర్ తీసుకునే నిర్ణయాల ఆధారంగా జరగాలని తీసుకున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారాయి. స్కూల్ అసిస్టెంట్ల నుంచి గ్రేడ్–2 పదోన్నతులకు నాలుగు రోజులుగా వెరిఫికేషన్ కన్ఫర్మేషన్ పేరుతో ఉపాధ్యాయులను ఇబ్బందులు పడేలా చేశారు. గురువారం ఉదయం 10:30 గంటలకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పదోన్నతులకు అర్హత పొందిన ఉపాధ్యాయులందరికీ స్థానాలను కేటాయిస్తామని చెప్పారు. అయితే వెబ్ కౌన్సెలింగ్‌కు ఉదయం నుంచి రాత్రి వరకు అదిగో చేస్తాం.. ఇదిగో చేస్తాం.. అంటూ సాంకేతిక కారణాలు చూపి ఆలస్యం చేశారు. దీంతో కౌన్సెలింగ్ కేంద్రం దగ్గర ఉపాధ్యాయుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఎట్టకేలకు పాఠశాల విద్యా డైరెక్టర్ మాన్యువల్ కౌన్సెలింగ్‌కు అనుమతించారు. విద్యాశాఖ అధికారులు చెబుతున్న ప్రకారం ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్‌లో 8, మున్సిపాలిటీలలో 7, జిల్లాపరిషత్ యాజమాన్య పరిధిలోని హైస్కూళ్లలో 146 గ్రేడ్–2 హెచ్‌ఎం పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేశారు. పదోన్నతులు పొందిన వారికి కర్నూలు డీఈఓ శామ్యూల్‌పాల్, నంద్యాల జిల్లా డీఈఓ జనార్దన్‌రెడ్డిలతో పాటు ఆయా సంఘాల నాయకులు పదోన్నతికి ఎంపిక చేసుకున్న ఆప్షన్ స్థానాలను అందజేశారు.

సాంకేతిక సమస్యలతోనే మాన్యువల్‌గా...

ఉపాధ్యాయుల బదిలీల చట్ట ప్రకారం పదోన్నతులు, బదిలీలు ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని కూటమి ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకొచ్చింది. అయితే ఉపాధ్యాయుల పదోన్నతులు ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు సాంకేతిక సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఉపాధ్యాయ సంఘాల ఒత్తిళ్లతో తప్పని పరిస్థితుల్లో మాన్యువల్‌గా పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే పదోన్నతులు పొందిన వారందరికీ ఆన్‌లైన్‌లోనే ఉత్తర్వులు రానున్నాయి. ఐక్య ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఉదయ రాజు, కరుణానిధి మూర్తి, శ్రీనివాస యాదవ్, ఉల్చాల రవికుమార్, నవీన్ పాటి, కృష్ణారెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.